క్లుప్తంగా

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

సామర్లకోట: స్థానికంగా అతి పురాతన విష్ణాలయం శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నారు. ఈ విషయాన్ని సోమవారం ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్త సంఘ సభ్యులు హాజరు కావాలన్నారు.

రేపు జాబ్‌మేళా

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 31న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి సోమవారం తెలిపారు. అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ఎల్అండ్ టీ కోజెంట్, సీఐఈ ఇండియా, డిక్సన్, డెక్కన్ కెమికల్స్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, బీటెక్ చదివిన యువతీయువకులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బుధవారం జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు చేశారు. బాలాత్రిపుర సుందరిదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అదే విధంగా ఆలయంలోని ఉపాలయాలు, మూలవిరాట్‌కు అభిషేకాలు జరిగాయి. ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, విజయ్‌లు పూజాదికాలు నిర్వహించారు.

సమస్యల సత్వర పరిష్కారానికి 'స్పందన'


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి స్పందన జరిగింది. దీనికి ఏడు అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆక్రమణలకు గురైన స్థలాలను కాపాడాలని, భూ రీ సర్వే చేయాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మారాయని, తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష తదితరులు ఉన్నారు.

పరిశ్రమలకు రాయితీలు కల్పించాలి


విద్యుత్తు నియంత్రణ మండలి అభిప్రాయ సేకరణలో పాల్గొన్న వినియోగదారులు

సామర్లకోట: కేవలం ఏడాదికి నెల రోజులు మాత్రమే తిరిగే సాగో పరిశ్రమలకు విద్యుత్తులో రాయితీలు కల్పించాలని ఆ పరిశ్రమ సంఘ నాయకుడు, శ్రీనివాస సాగో ఇండస్ట్రీస్ యజమాని సత్యనారాయణ ప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి నిర్వహించిన ఆన్‌లైన్ సూచనలు, సలహాల్లో భాగంగా పలువురు పాల్గొని వారి అభిప్రాయాలను తెలియజేశారు. కేవలం నెల రోజులు మాత్రమే తిరిగే పరిశ్రమకు ఏడాది పొడవునా ఒకే రకమైన కేటగిరీ వర్తించే విధంగా చేయడంతో చిన్న పరిశ్రమలు దెబ్బతింటున్నాయని సత్యనారాయణ అన్నారు. అదే విధంగా జిల్లా మానవ హక్కుల సంఘ నాయకుడు నూతలపాటి అప్పలకొండ ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు వారికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీ అందే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ఎ.ప్రభాకరరావు, ఏడీఈలు రాంబాబు, కిరణ్ పాల్గొన్నారు.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న శునకాలు
- గుంపులుగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులపై దాడులు
- ఆసుపత్రులకు క్యూ కడుతున్న బాధితులు


విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

కొత్తపల్లి: నియోజకవర్గంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. పిఠాపురం పట్టణం, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, కొత్తపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో కుక్కలు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ వృద్ధులు, పిల్లలపై దాడులు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలను వెంబడించి..

గ్రామాల్లోని పాదచారులతో పాటు ద్విచక్ర వాహనాలను వెంబడించి కుక్కలు దాడి చేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై దాడి చేసి పిక్కలు లాగేస్తున్నాయి. దీంతో ఆసుపత్రుల్లో కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. ప్రధాన కూడళ్లు, మాంసం దుకాణాలు, చేపల మార్కెట్లలో అధికంగా కుక్కలు సంచరిస్తున్నాయి. పలు గ్రామాల్లో వాహనాలను కుక్కలు వెంబడించడంతో వాటి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పెరుగుతున్న బాధితులు

కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాదు, మూలపేట, కొండెవరం, కొమరగిరి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో కుక్కల దాడిలో గాయపడే రోగులసంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత నెల రోజులుగా సుమారు 300 కేసులు నమోదైనట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుక్కకాటు బారిన వైద్యానికి వస్తున్నారని డాక్టర్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో శునకాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి



గ్రామాల్లో పిల్లలపై దాడి చేస్తున్న వీధికుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలి. పల్లెల్లో పగలు, రాత్రి తేడా లేకుండా కుక్కలు సంచరిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వాహనాలపై వెళ్లే వారిని సైతం వెంబడించి కరుస్తున్నాయి. కుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఎస్.లోవలక్ష్మి, గ్రామ సచివాలయ కన్వీనర్, ఉప్పాడ

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

- కాకినాడ ఎంపీ వంగా గీత
- మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ


గొల్లప్రోలులో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు


చేబ్రోలులో లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి నమూనా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్రమం తప్పకుండా నాలుగు విడతలుగా మహిళలకు ఆసరా నిధులు విడుదల చేసిందన్నారు. మహిళలు ఆసరా సొమ్మును సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూ.చా. తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో 381 మహిళా సంఘాల్లోని 3726 మంది సభ్యులకు రూ.3.21 కోట్లు, గొల్లప్రోలు మండలంలో 956 మహిళా సంఘాల్లోని 9707 మంది సభ్యులకు రూ.6.36 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ నేతలు మొగలి బాబ్జి, పీఏసీఎస్ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, పార్టీ మండలాధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు


వేట్లపాలెంలో వేంకటేశ్వరస్వామి ఆలయం


వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

- వచ్చే నెల 19 నుంచి ఉత్సవాలు
- వేట్లపాలెంలో ఆలయానికి ముస్తాబు

సామర్లకోట: వేట్లపాలెంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. ఈ ఉత్సవాలను వచ్చే నెల 19 నుంచి 24 వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. సోమవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత పెంచేందుకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో వారానికి ఒకసారి భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వేట్లపాలెం కెనాల్ రోడ్డులో నిర్మాణం కావడంతో ప్రతి ఏడాది భీష్మ ఏకాదశి పర్వదినం రోజున కల్యాణం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 19న స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. 20న భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి భక్తుల గోత్రనామాలతో పూజలు, గోపూజ, లక్ష పుష్పాలతో 108 మంది భక్తులచే పూజలు చేస్తామన్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు శేషవాహనంపై సేవ చేసి ఆలయానికి తిరిగి వచ్చిన తరువాత రాత్రి కల్యాణం జరుపుతామన్నారు. ఈ కల్యాణోత్సవాన్ని పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాసు దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు వాడపల్లి గోపాలాచార్యులు నిర్వహిస్తారని తెలిపారు. 21న సాయంత్రం స్వామి, అమ్మవార్లకు సింహ వాహనంపై సేవ, 22న గరుడ వాహన సేవ అనంతరం రాత్రి సదస్యం, 23న ఉదయం పూజలు, సాయంత్రం హనుమద్ వాహన సేవ, 24న ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, సాయంత్రం గజవాహన సేవ, రాత్రి శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రంగులు, దాతల సహకారంతో విద్యుత్తు దీపాలంకరణలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు తప్పని సరిగా మాస్కులు ధరించాలని సూచించారు.

ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

సామర్లకోట: స్థానిక ఆంధ్ర బాపిస్టు చర్చి 60 వసంతాల డైమండ్ జూబ్లీ ఉత్సవాల కరపత్రాలను సోమవారం సాయంత్రం ఆ చర్చిలో సంఘ అధ్యక్షుడు బీఏస్ వందనం ఆవిష్కరించారు. క్రైస్తవ మిషనరీలు కేటాయించిన స్థలంలో నడుస్తున్న చర్చిని ప్రారంభించి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఫిబ్రవరి 16 నుంచి డైమండ్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని పురస్కరించుకుని 14, 15 తేదీల్లో విశాఖపట్నంకు చెందిన పీఏ స్వామి ముఖ్య ప్రసంగీకులు పాల్గొని ఉజ్జీవ సభలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ బి.కిరణ్‌కుమార్, సంఘ నాయకులు టి.సూర్యారావు, బి.అన్నపూర్ణ, పిట్టా సత్యనారాయణ, ఐతా జీవన్‌కుమార్, జీవీ రాఘవ పాల్గొన్నారు.

గొప్ప నటి అంజలీదేవి


అంజలీదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు

పెద్దాపురం: తన నటనా కౌశలంతో యావత్ ప్రజానీకాన్ని మెప్పించిన నటి అంజలీదేవి అని పలువురు వక్తలు అన్నారు. పెద్దాపురం పట్టణ ఆడపడుచు అంజలీదేవి తొమ్మిదో వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఫౌండేషన్ కన్వీనర్ పాలమరశెట్టి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, కౌన్సిలర్ గోళ్ల విజయలక్ష్మి మాట్లాడుతూ నటనలో, వ్యక్తిగత జీవితంలో అందరికీ ఆదర్శంగా నిలిచి గొప్ప నటి అంజలీదేవి అన్నారు. ఆమెను కళాకారులు ఆదర్శం తీసుకోవాలని పిలుపునిచ్చారు. నటి అంజలీదేవి పెద్దాపురంలో జన్మించడం పట్టణ ప్రజలకు గర్వకారణమన్నారు. అంజలీదేవి మేనల్లుడు గోళ్ల బాబి, గోళ్ల శ్రీను తదితరులు మాట్లాడుతూ అభిమానుల గుండెల్లో చెరగని ముద్రగా ఆమె నిలిచిపోతారన్నారు. తొలుత అంజలీదేవి విగ్రహానికి వారు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రంధి సత్యనారాయణ, ఒబిలిశెట్టి గణేష్, అంజలీదేవి కుటుంబ సభ్యులు, అభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు కళాజాత


రాష్ట్ర స్థాయి కళారూపాల శిక్షణ సభలో మాట్లాడుతున్న మురళీధర్

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ అంశాలపై శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలనే ఉద్దేశంతో వచ్చే నెల 5వ తేదీ నుంచి కళాజాతా ప్రారంభం అవుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ తెలిపారు. సైన్స్ సమాజం కోసమే అని నమ్ముతూ నడుస్తున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి కళారూపాల శిక్షణ స్థానిక యాసలపు సూర్యారావు భవన్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకుడు గాదె సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మురళీధర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో రచయితల వర్క్‌షాప్ జరిగిందని, దానికి కొనసాగింపుగా పాటల రికార్డింగ్ పూర్తి చేసుకుని, నేడు జాతా ప్రారంభమవుతుందని చెప్పారు. కళాశాలలు, నివాస ప్రాంతాలు కేంద్రీకృతంగా ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు రెడ్డి, శ్రీరాములు, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలాడుతున్న ముగ్గురి అరెస్టు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి సమీపంలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై బాలాజీ సోమవారం తెలిపారు. తాటిపర్తిలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు కోళ్లు, రూ.7300 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

పారిశుధ్య సమస్య రానీయొద్దు

- త్వరితగతిన పూడికతీత పనులు చేపట్టండి
- సమస్యలపై గళమెత్తిన కౌన్సిల్ సభ్యులు


మున్సిపల్ సమావేశంలో మాట్లాడున్న కౌన్సిలర్ కృష్ణబాపూజీ


మాట్లాడుతున్న చైర్ పర్సన్ మంగతాయారు

పెద్దాపురం: పారిశుధ్య సమస్య రానీయొద్దు.. ఎక్కడా మాట పడకుండా త్వరితగతిన కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కౌన్సిల్ సభ్యులు సూచించారు. పెద్దాపురంలోని అన్ని వార్డుల్లో సత్వర పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు వారు సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆకుల కృష్ణబాపూజీ, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవు మాట్లాడుతూ పట్టణంలోని కాలువల్లో పూడికతీత పనులు త్వరగా చేపట్టాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ స్థానిక ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద నిరుపయోగంగా ఉన్న భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పట్టణంలో అభివృద్ధి పనులను ముమ్మరం చెయ్యాలన్నారు. కౌన్సిలర్ వీర్రాఘవులు మాట్లాడుతూ గుడివాడ ఏరియాలో తాగునీటి సరఫరాపై ఎన్నిసార్లు చెప్పినా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని అన్నారు. కృష్ణబాపూజీ మాట్లాడుతూ రెండో విడత టిడ్కో గృహాలను లబ్దిదారులకు సత్వరమే అందజేయాలన్నారు. అనంతరం పలు ప్రజా సమస్యలపై సభ్యులు సమావేశంలో చర్చించారు.

రాజశేఖర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్‌ను కౌన్సిల్ సభ్యులంతా ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. 18 ఏళ్లుగా 214 నెలలు కౌన్సిల్ సమావేశాలకు ఎప్పుడూ హాజరు కాకుండా లేరన్నారు. తొలిసారి ఈ సమావేశానికి తన భార్య ఆపరేషన్ కారణంగా హాజరు కాలేకపోయారన్నారు. అయినప్పటికీ ప్రజా సమస్యలపై ఫోన్‌లోనే కొన్ని సలహాలిచ్చి ఈ సమావేశానికి హాజరు కాలేకపోతున్నాని చెప్పారన్నారు. సభ్యులంతా ప్రతి సమావేశానికి హాజరవ్వాలంటే రాజశేఖర్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పద్మావతి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, శ్యామలత, కౌన్సిలర్లు అంబిక, విజయలక్ష్మి, కట్టా రాజబాబు, పప్పల దుర్గారావు, ఆయా వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయను దర్శించిన కాకినాడ ఎంపీ వంగా గీత


పాదగయ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రాన్ని సోమవారం కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు అధికారులు, పండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీ గీత ఆలయంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురూహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు ఆమెకు స్వామివారి ప్రసాదాలు బహూకరించారు.

దొరబాబును కలసిన పెద్దాపురం కమిషనర్


దొరబాబును కలసిన పెద్దాపురం కమిషనర్ పద్మావతి

సామర్లకోట: పెద్దాపురం నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేవీ పద్మావతి సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబును కలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన తరువాత మర్యాద పూర్వకంగా దొరబాబును కలిశారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ కుటుంబానికి పరామర్శ

సామర్లకోట: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరామర్శించారు. అరుణ మావయ్య స్వామినాయుడు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. స్వామినాయుడు చిత్రపటానికి రాజప్ప పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

12న మార్కెట్ ఆశీల వేలం

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ఆశీలు వసూలు చేసుకోవడానికి ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసిన షాపులు, సంత మార్కెట్‌లో ఆశీల వసూలు, మేకల, పశువుల కబేళాలకు వేలం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆయా వేలం పాటల్లో పాల్గొనాలన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు అదృశ్యమైన బాలిక

కొత్తపల్లి: బాలిక అదృశ్యంపై ఫిర్యాదు అందిన గంట లోపే బాలికను పట్టుకుని కుటుంబ సభ్యులు (బంధువులు)కు అప్పగించినట్లు సోమవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని ఉప్పాడ శివారు సుబ్బంపేటకు చెందిన ఒక మైనర్ బాలిక స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమెకు ఇన్‌స్టాగామ్‌లో అనంతపురానికి చెందిన ఓ యువకుడు పరిచయం అయ్యాడు. కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆదివారం రాత్రి అతడిని కలవడానికి బయలుదేరి వెళ్లింది. బాలిక ఇంటికి రాకపోవడంతో ఆమె తండ్రి మైలపల్లి యోహాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు సెల్‌ఫోన్ ఆధారంగా కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాలికను పోలీసులు గుర్తించారు. బాలికకు ఎస్సై స్వామి నాయుడు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

నాగులాపల్లిలో భవిష్యత్తుకు గ్యారంటీ

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో సోమవారం మాజీ ఎమ్మెల్యే వర్మ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంద్రకోటలో క్షుద్ర పూజల కలకలం


క్షుద్ర పూజల వదంతులు నమ్మవద్దని కాంద్రకోట గ్రామస్తులకు చెబుతున్న ఎస్ఐ

పెద్దాపురం: మండలంలోని కాంద్రకోటలో క్షుద్ర పూజలు సాగుతున్నాయంటూ జరిగిన ప్రచారం కలకలం రేపింది. గ్రామంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి అర్ధరాత్రి ఇళ్ల ముందు గడప వద్ద ముగ్గు వేసి, పసుపు, కుంకుమ ఉంచడంతో గ్రామంలో ఎవరో రాత్రి వేళ క్షుద్ర పూజలు చేస్తున్నారంటూ ప్రచారం సాగింది. ఓ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఈ పని చేస్తున్నట్టు గుర్తించి అతనిని వెంబడించారు. పరారు కావడంతో పెద్దాపురం పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సోమవారం ఉదయం పెద్దాపురం ఎస్ఐ వెలుగుల సురేష్ గ్రామంలో పర్యటించి అవన్నీ వదంతులని, ఎవరూ వదంతులు నమ్మి భయాందోళనలు చెందవద్దని సూచించారు.